

# ఒంటరి మనిషి

కాశీనాథ కాశీనాథ

చీకటి పడుతోంది. క్లబ్బులో టెన్నిస్ నెట్ విప్పేశారు మెంబర్లు ఒక్కొక్కళ్లే చేరుకుంటు న్నారు కొంచెం సేపటిలో క్లబ్బు బాగా సందడిగా తయారయింది.

రాఘవరావుగారు ఒక పక్కగా పేము కుర్చీలో కూర్చున్నారు ఆయనతో ఎప్పుడూ చదరంగం ఆడే రామనాథం ఇంకా రాలేదు 'ఇవాళ రాడేమో' అను కున్నారు ఇంకెవరయినా ఆడమంటే ఆడతారు కాని సమ ఉజ్జీతో ఆడితేనే బాగుంటుందని ఆయన ఎవర్నీ అడగలేదు

కొంచెంసేపు ఊరికే కూర్చున్నాక ఇంక తోచలేదు నెమ్మదిగా రమ్మీ టేబులు దగ్గిరకి వచ్చి కూర్చున్నారు

'ఇంట్లో కేంపు ఉందని చెప్పివచ్చాను. రెండు రోజులదాకా కదలక్కర్లేదు' అంటున్నాడు ఒకతను హుషారుగా

ఆట జోరుగా సాగుతోంది

రాఘవరావుగారు రమ్మీ ఆడరు వాళ్ల కులాసా కాసేపు చూస్తారు అంతే. పేకాట వల్ల డబ్బులు పోతాయనికాదు, అదృష్టంమీద ఆధారపడటం అలవాటు చేస్తుందని

అక్కడ అందరూ హాయిగా గడుపుతారు. ఒకతను 'ఒక డీలు వెయ్యవయ్యా. ఇవాళ పాతిక రూపాయలైనా లాభం సంపాదించకపోతే మా ఆవిడ తలుపు తియ్యనంది' అంటున్నాడు

అక్కడ వాళ్లంతా ఆడకుండా పక్కన కూర్చుని చూస్తున్నవాళ్లమీద జోక్ చేస్తుంటారు! పక్కన కూర్చుంటే నీకు కూడా ఆడబుద్ధి వెయ్యటం లేదా? అని అడుగుతారు 'లేదు' అంటే అదే 'ఆడబుద్ధి' అంటారు. రాఘవరావుగారు వయసులో పెద్దవాడు, మర్యాదస్తుడు కాబట్టి ఆ జోక్ వెయ్యరు అయినా అక్కడినుంచి కదిలారు ఆయన

రామనాథం ఇంకా రాలేదు

కాసేపు బ్రిడ్జి టేబులు దగ్గిర కూర్చున్నారు ఒక టీమువాళ్లు సిక్స్‌స్పేడ్ బిడ్ చేశారు డిక్లెరర్ దగ్గిర స్పేడులు ఏస్, జాక్, రెండు ముక్కలు ఉన్నాయి డమ్మీలో కింగ్, నైన్, రెండు ముక్కలు ఉన్నాయి ఎలా ఆడాలో తెలియక ట్రంప్‌లోనే రెండు ట్రిక్స్ ఇచ్చి వల్నరబుల్ స్లామ్‌డౌన్ చేశాడు పధ్నాలుగు వందల ముప్ఫయి పాయింట్లు రావలసింది పోయి వంద పాయింట్లు అవతల వాళ్లకి వచ్చాయి. రాఘవరావుగారికి ఎలా ఆడాలో తెలుసు అయినా చెప్పలేదు అడగకుండా చెప్పడం ఆయన తత్వం కాదు వాళ్లు అడగలేదు

అక్కడ ఇంక కూర్చోబుద్ధి కాక పక్కకి వచ్చారు చదరంగం బల్ల దగ్గిర ఎవరో కుర్రాళ్లు చేరారు సరదాకోసం ఆడే రకం వాళ్లు.

అక్కడికి వెళ్లడం ఇష్టంలేక పేపరు తీసుకుని దూరంగా కూర్చున్నారు ఆయన పేపరు అంతా చదివినదే పొద్దున్న ఒక గంటసేపు పేపరుతో గడిచింది

ఆయన ప్రొద్దున్న లేవగానే ఒక గంటసేపు పేపరుతో గడుపుతారు బయటికి వెళ్ళి కాఫీ తాగి వచ్చాక వారపత్రికతో కాసేపు కాలక్షేపం తర్వాత అన్నం వండుకుని తినేటప్పటికి పదకొండున్నర అవుతుంది అప్పుడు నిద్రవస్తుంది కాని పగలు పడుకుంటే రాత్రి నిద్రపట్టదని చాలాసేపు పుస్తకాలు చదువుతారు అప్పటికీ నిద్ర వస్తుంటే మేట్నీకి వెళ్ళిపోతారు సాయంత్రం క్లబ్బు తొమ్మిదిన్నరకి ఇంటికి వస్తారు అప్పుడు అన్నం తిన్నాక నిద్రకని ప్రయత్నిస్తారు

అప్పుడు ప్రారంభమవుతుంది అసలు సమస్య నిద్రపట్టదు. ఒంటిగంట అయినా రెండయినా నిద్ర పట్టదు ఆలోచనలు ముసురుతూ ఉంటాయి. భార్యా పిల్లలూ గుర్తుకు వస్తారు. అప్పుడు మొదలయిన ఆలోచనల మధ్యన ఎంతకీ తెగదు. వాటి నుంచి తప్పించుకుందామని పుస్తకం తీసుకున్నా చదవబుద్ధి కాదు పగలు చాలా భాగం ఆలోచనలని జయించగలిగినా రాత్రి మాత్రం అవి వీరవిహారం చేస్తాయి

కేవలం బాధ అయితే భరించవచ్చు. మరిచి పోవడానికి ప్రయత్నించవచ్చు సమస్యలయితే పరిష్కారమార్గం కోసం అన్వేషించవచ్చు నష్టంతో తేలిపోయే సమస్యలయితే నష్టం భరించనూ వచ్చు పూర్తిగా ఇది అని చెప్పలేని ఆలోచనలు ఆయనవి మనసు మనిషిని ఎంత కష్టపెట్టగలదో ఆయనకి ప్రతిరోజూ అనుభవమే ఒకరోజు కాదు. ఒక నెల కాదు సుమారు మూడు సంవత్సరాల నుంచీ ఇదే ఒంటరి బ్రతుకు పగలు వ్యాపకం కోసం, రాత్రి నిద్రకోసం పోరాటం ఇంటిని వదిలిపెట్టి పగలు ఎంత తిరిగినా రాత్రి ఇంటికి రాక తప్పదు ఆలోచనల పంజరంలో ఇరుక్కోక తప్పదు

క్లబ్బులో ఏమీ తోచకపోయినా అందుకే ఇంటికి బయలుదేరలేదు ఆయన

టైము ఎనిమిది అయింది ఇంక చదరంగం లేనట్లే. ఎలాగో ఒకలా తొమ్మిదిన్నర వరకూ గడపాలి.

నెమ్మదిగా లేచి టేబుల్ టెన్నిస్ కొంతసేపు చూసి తర్వాత కేరమ్స్‌బోర్డు వైపు నడిచారు ఆయన అక్కడ ముగ్గురే ఉండటం చూసి తను కూడా కూర్చున్నారు రాఘవరావుగారికి కేరమ్స్ బాగా రాదు. ఆ ముగ్గురికీ కూడా రాదుగాని సరదాగా మాట్లాడు కుంటూ ఆడుతున్నారు కాయిన్ పడనప్పుడు 'అంత ఈజీ కాయిన్ ఉక్కుతావేం?' అని అడిగాడు ఒకడు. 'నేను ఉక్కుమనిషిని' అన్నాడు రెండో వాడు ఇలా సరదాగా గంటసేపు ఆడారు రాఘవరావుగారికి బాగా కాలక్షేపం అయింది

తొమ్మిదిన్నరకి ఇంటికి వెడుతూ ఆలోచిస్తు న్నారు ఆయన

హఠాత్తుగా ఆలోచన వచ్చింది

ఉత్తరం రాయాలి!

ఆ వూహ రాగానే ఆయన మనసు కొంత శాంతించింది ధైర్యంగా ఇంటికి వెళ్లారు అన్నం

తినబుద్ధికాలేదు కాసిని మంచినీళ్ళు తాగి పక్కమీద పడుకున్నారు

ఇప్పుడు ఆయన ఆలోచనలకి భయపడటంలేదు ఆ ఆలోచనలని ఒక క్రమపద్ధతిలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు, సమగ్రమయిన ఉత్తరం రాయడానికి

ఉత్తరం రాయడానికి ఆయన తొందరపడలేదు తన మనసు అందులో అద్దంలో లాగా ప్రతిబింబించాలి తన మనస్సాగర మథన అందులో వ్యక్తీకరింపబడాలి అప్పుడు తన గుండె బరువు తీరాలి

నెల రోజుల తర్వాత ఒక రోజు కూర్చుని ఉత్తరం రాశారు చాలా పెద్ద ఉత్తరం రాశాక మళ్ళీ ఒకసారి చదువుకుని తృప్తిపడి పోస్టు చేశారు

పోస్టు చేశాక ఆ రాత్రి హాయిగా నిద్రపట్టింది, మూడు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా !

* * *

'పోస్ట్' అని వినపడింది రమేష్‌కి

ఆఫీసుకి బయలుదేరుతున్నవాడు ఆగి ఉత్తరం అందుకున్నాడు అక్కడే నిలబడి చదివాడు సుజాతకి ఇచ్చి చదవమన్నాడు అతడి కళ్లల్లో నీటిపొరని చూసి ఆమె కూడా చదివింది

అందులో ఇలా ఉంది

ప్రియమైన రమేష్‌కి,

నీ తండ్రి ఆశీర్వదించి వ్రాయునది దాదాపు రెండున్నర సంవత్సరాలు మౌనంగా ఉన్న అనంతరం నీకీ ఉత్తరం రాస్తున్నాను ఈ ఉత్తరం రాసే ముందు నేను చాలా ఆలోచించాను. ఇది చాలా ముఖ్యమైన ఉత్తరం ఒక కథంత ఉత్తరం. కోడల్ని కూడా చదవమను

ఒకప్పుడు నలుగురూ సందడిగా తిరిగిన ఈ ఇంట్లో ఇప్పుడు ఒంటరిగా ఉన్నాను ఒక్కడినీ పగలంతా తిరగటం, తిరిగి వచ్చి శూన్యంగా ఉన్న ఈ యింటిలో ఆలోచిస్తూ, బాధపడుతూ పడుకోవడం— ఇదే నాకు మిగిలినది

మీ అమ్మ పోయినప్పుడే సగం ఒంటరినయ్యాను మీరందరూ విడిచిపోయాక ఇప్పుడు పూర్తిగా ఒంటరినయ్యాను

అయితే ఒంటరితనం వల్ల నేనీ ఉత్తరం వ్రాయటంలేదు ఈ వృద్ధాప్యంలో నా గతికి నన్ను వదిలేసి ఎందుకు వెళ్ళిపోయారు ? అని కూడా అడగటం లేదు. నేను మీకు ఎందుకు అర్థంకాకుండా పోయాను? అన్నదే నా బాధ

"నాన్నా నా మనసు మీకు అర్థంకాదు సుజాతని నేను పెళ్లి చేసుకుంటాను" అని చాలా ఖండితంగా అన్నావు నా మాటని నిర్లక్ష్యంగా తీసి పారేసి రిజిష్టరు పెళ్లి చేసుకున్నావు నన్ను దూరంగా ఉంచేశావు పాతకాలపు వాడిననీ, కన్సర్వేటివ్‌ననీ ఇంకా చాలా అన్నావు ఇప్పుడు నీ భార్య అయిన సుజాత కాలేజీ రోజుల్లోనే శీలం పోగొట్టుకుంది బిడ్డనికూడా కన్నది. విధికృతంగా ఆ బిడ్డ పుట్టిన రెండవ రోజునే మరణించాడు ఇవన్నీ నీకూ తెలుసు విశేషంలా మన సుశీలని చేసుకోమని నిన్ను అడిగాను నువ్వు నా మాటని పట్టించుకోలేదు. నాకు అది అశనిపాతంలాగా తగిలింది మనసు తలక్రిందులయినా సహించుకున్నాను నాకు నా చెల్లెలు

# ఒంటరి మనిషి

అన్నా నా మేనకోడలు సుశీల అన్నా ఉండే అభిమానం నీకు ఉండకపోవడం సహజమే అనుకున్నాను కాని 'సుశీలని చేసుకోక పోయినా మరో సలక్షణమయిన కన్యని చేసుకో శీలం పోగొట్టుకుని బిడ్డ తల్లి అయిన అమ్మాయిని మాత్రం చేసుకోవద్దు' అని ఖండితంగా చెప్పడం నా తప్పా ? అదేనా నేను చేసిన మహాపరాధం?

నీ చెల్లెలికి పెళ్లి సంబంధం చూడటం కూడా నా తప్పే అయింది ఎం ఏ చదివిన తర్వాత అయినా ఆడదానికి పెళ్లి అవసరం కాదా ? స్త్రీ జీవితానికి పెళ్లితోనే సంపూర్ణత్వం వస్తుందని పెళ్లి సంబంధం మాట్లాడాను జయ ఒప్పుకోలేదు దానికి ప్రేమ వివాహంమీద వ్యామోహం అనుకోకుండా, ప్రయత్నించకుండా ఎవరి మీదైనా ఇష్టం కలిగితే అది ప్రేమ అవుతుంది అంతేగాని ఎవర్ని ప్రేమించాలి అనుకుంటే అది ప్రేమ ఎలా అవుతుంది ? తను చేసుకోబోయే వ్యక్తి తనతో మనసులు పంచుకున్నవాడే అయి ఉండాలంది అలా ఎవరితోనైనా పరిచయం అయి తన మనసు దోచుకునే వ్యక్తి తటస్థపడే వరకూ పెళ్లి చేసుకోనంది పెళ్లి విషయంలో ఆడపిల్ల స్వయం నిర్ణయం చేసుకోనిస్తే సాధారణంగా తప్పటడుగులు వేస్తారని నా అభిప్రాయం జీవితాంతం పోషించలేని ఒక అనర్థుడిని, ప్రేమ పేరుతో గుడ్డిగా నమ్మి పెళ్లి చేసుకోవడం నాకు ఇప్పటికీ ఇష్టం లేదు చాలా మంది యొక్క ప్రేమలు తాత్కాలికంగా కళ్ళు కప్పే భ్రమలని నా నమ్మకం ఆకలి, కష్టాలు ఆ భ్రమ అనే తెరని తొలగిస్తాయి ఆ భ్రమలో పెళ్లి చేసుకున్నవారు తమ వైఫల్యానికి విధిని కూడా నిందించలేరు నువ్వూ దానిని సపోర్ట్ చేశావు అప్పటి నుంచీ జయ నాకు ఉత్తరం రాయలేదు తండ్రినని కూడా గుర్తుపెట్టుకోలేదు

ఇదంతా ఒక ఎత్తు శేషు చేసినది ఒక ఎత్తు. మీ అమ్మ పోయినప్పుడు కర్మకి ఉండమంటే ఉండలేదు. ఈ కర్మలన్నీ మూర్ఖత్వం అన్నాడు అమ్మ మీద ప్రేమ, అభిమానం ఉన్నాయి కాని వీటిమీద నమ్మకం లేదన్నాడు. నాకు నమ్మకం ఉంది, అది నా కోరిక అని చెప్పినా కాదని వెళ్లిపోయాడు అప్పటికీ, ఇప్పటికీ తలచుకున్నప్పుడల్లా గుండెల్ని కలచివేసే సంఘటన అది ఒక్కొక్క సంవత్సరం గడిచి మీ అమ్మని శాస్త్ర పూర్వకంగా గుర్తు చేసుకుంటున్నప్పుడల్లా ఇది నాకు బాధ కలిగిస్తూనే ఉంటుంది

ముగ్గురు పిల్లలతో జరిగిన ఈ మూడు సంఘటనలూ తలచుకుంటేనే జీవితంలో మోసపోయినట్లుగా బాధ కలుగుతుంది నా కన్నబిడ్డల దగ్గర నాకు పరాజయం ! వాళ్లకీ నాకూ మధ్య అంతులేని అగాధం ! నేనూ నా వాళ్ళూ అని మాటవరసకి కూడా అనుకోలేని నిస్సహాయత ! అయితే

కొన్నాళ్లనుంచీ నా ఆలోచనలు మారాయి. జీవితంలో కొత్త విషయాలు తెలుసుకుంటున్నానని పిస్తోంది మీ కెంతకీ నేను అర్థం కాకపోవడం, నాకు ఎంతకీ మీరు అర్థం కాకపోవడం చాలా సహజం అనిపిస్తోంది. సృష్టి సూత్రం అదేననిపిస్తోంది ఇవే సంఘటనలు, ఇవే సందర్భాలూ కాకపోయినా మనిషికి ఇలాంటి అనుభవాలు ఏభై సంవత్సరాల వయసు తర్వాత తప్పవు అనిపిస్తోంది ఎందుకంటే అప్పటికి ఆ మనిషి చుట్టూ కొత్త తరం ఆవిర్భవిస్తుంది !

ఆ కొత్త తరం పాత తరం భుజాలమీద నుంచుని ప్రపంచాన్ని చూస్తుంది ఆ దృష్టి, ఆ వాతావరణం వేరు అది పాత తరానికి అందదు ఈ తరం సంస్కరణలనుకున్నవి తర్వాత తరానికి కనీస ధర్మాలు, పునాదులు అవుతాయి మనిషి ముందు తరంలోకి చూడలేకపోవడానికి నాకు కారణం తెలుస్తోంది

మనిషికి లోకజ్ఞానం అలవడేటప్పుడు, ప్రపంచాన్ని అవగాహన చేసుకునేటప్పుడు, కొత్త ఊహలు వస్తాయి ఈ ప్రపంచం ఎందులో వెనుకబడి ఉందో తెలుస్తుంది ఆ విషయంలో చాలా ముందుకుపోయి తన వూహల్ని ఆదర్శంగా పెట్టుకుంటాడు కాని కాలగమనంతో ప్రపంచం ఇంకా ముందుకు పోతుంది ఈనాటి ఆదర్శం రేపటి వెనుకబడిన తనం అవుతుంది చేతనైతే ఎప్పుడూ ముందే ఉండాలి కొత్తని మంచీ చెడ్డా విచక్షణ లేకుండా ఆహ్వానించాలి అటువంటి మనిషికి వ్యక్తిత్వం ఉండదు కాని అలా జరగదు మనిషికి కాలంతో మారే లక్షణం ముప్పయి, ముప్పయి అయిదు సంవత్సరాల వయసువరకే ఉంటుంది ఆ వయసుతో అతనికి మారే శక్తి ఇగిరిపోతుంది అందుకనే అతని తర్వాత తరానికీ అతనికీ సంఘర్షణ! నువ్వొక అంతస్థులో నేనొక అంతస్థులో నిలబడి ఒకరివైపు ఒకరు చేతులు ఎంత చాచినాఒకరి కొకరు అందము తరాలూ అంతే.

తనదే తుది నిర్ణయంగా, ఇంటికి తనే అధిపతిగా ఇరవై సంవత్సరాలు గడుపుతాడు మనిషి అప్పుడే వ్యక్తిత్వం స్వాభిమానం, దర్పం ఏర్పడుతాయి ఆ తర్వాత అధికారం కొత్త తరానికి వచ్చేస్తుంది. కొత్తతరానికి నిర్ణయాలు తీసుకునే ధైర్యం, నైజం వచ్చేస్తాయి ఇంట్లో కీలకమైన స్థానం కొత్త తరానికి వచ్చి పాతవ్యక్తి కొత్తవాళ్లు ఇచ్చే గౌరవంపై ఆధారపడవలసి వస్తుంది

తండ్రి తన జీవితాంతం ఏదైతే పొందలేక పోయాడో దానిని తను అష్టకష్టాలూ పడి కొడుకులకి సమకూర్చిపెడితే దాని విలువ కొడుకులు గుర్తించరు. తండ్రికి కావలసిన గుర్తింపు, కృతజ్ఞత దొరకదు అవి కనీస అవసరాలుగా వాళ్లు లెక్కవేసి ఆ పై అవసరాల కోసం చూస్తారు తండ్రికి కొడుకు, కొడుకుకి తండ్రి అర్థంకారు ఎంత తెలివిగల వాళ్లయినా ఈ సమస్యలో కాలు జారక తప్పదు ఎప్పటి కప్పుడు కాలానికి అనుగుణంగా మారగల శక్తి మనిషికి ఒక తరంసేపు ఉండకపోవడమే ఈ సమస్యకి మూల కారణం

మామూలు మనిషికేకాదు, మనసు ఎదిగిన వాడికీ అదే గతి.

నువ్వు నవ్వుకోవచ్చుగానీ నేనూ నా కాలంలో ఆదర్శవాదినే మీ తాతగారు వద్దంటున్నా, అందరూ వ్యతిరేకించి 'ఆడదానికి చదువు లెందుకు ?' అని అన్నా నేను ప్రతిఘటించి మీ అత్తయ్యని చదివించాను. ఇప్పుడు స్త్రీకి చదువు అవసరం అని అందరూ గుర్తించారు.

# నాదసుధావర్షిణి శ్రీమతి జానకి చలనచిత్ర రజతోత్సవం

సంగీత ప్రియులకూ సుపరిచితమైన ప్రముఖ గాయనీమణి శ్రీమతి యస్ జానకి చలన చిత్ర రజతోత్సవం గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జనవరి 9వ తేదీన వైభవోపేతంగా జరిగింది ఈ సందర్భంగా ఆమెకు ''నాదసుధావర్షిణి'' బిరుదును ప్రదానం చేశారు

ఉత్సవంలో ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి శ్రీ జి రామానుజులనాయుడు పాల్గొన్నారు

దక్షిణ భారత చలన చిత్ర సంగీత రంగమంతా తరలివచ్చిందా అన్నట్లు ప్రముఖ సంగీత దర్శకులు, గాయనీ గాయకులు వచ్చి శ్రీమతి జానకిని అభినందించారు. నటీనటులు శ్రీ టి. యల్ కాంతారావు, శ్రీమతి శారద, శ్రీ రావి కొండలరావు, శ్రీమతి రాధాకుమారి విచ్చేశారు ఎ. వి యం సంస్థ ప్రతినిధి శ్రీ షణ్ముగం ఆమెను గోల్డెన్ డిస్క్‌తో సన్మానించారు శ్రీమతి శారద అందమయిన తాజ్ మహల్‌ను బహూకరించారు

సంగీతంలో ఉద్దండులు సర్వశ్రీ పెండ్యాల, రాజేశ్వరరావు, చలపతిరావు, డా॥ బాలమురళీకృష్ణ, ఇళయరాజా, కె. వి. మహదేవన్, చక్రవర్తి, లింగప్ప, వెంకటేష్, జె. వి. రాఘవులు, పిఠాపురంగార్లు ఆమెను ఆశీర్వదించి సన్మానించారు. గాయనీ గాయకులు శ్రీమతి పి. సుశీల, యస్ పి బాలసుబ్రహ్మణ్యం, సౌందరరాజన్, జమునారాణి, పి. లీల, బి. వసంత యస్ పి శైలజ, పి బి శ్రీనివాస్, రామకృష్ణ, ఆనంద్‌లు ఆమెను అభినందించారు. సినీ రచయితలు వేటూరి, జూనియర్ సముద్రాల కూడా పాల్గొన్నారు.



శ్రీమతి జానకికి కిరీటాన్ని బహూకరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీ రామానుజుల నాయుడు

ప్రముఖ గాయని శ్రీమతి పి సుశీల శ్రీమతి జానకికి బొట్టు పెట్టి, నూతన వస్త్రాలతో సన్మానిస్తుంటే ''ఒక కోకిలకు మరో కోకిల సన్మానం'' అనిపించింది శ్రీమతి జానకి మావగారు, ప్రముఖ మోనో ఏక్టర్ శ్రీ చంద్రశేఖరం కూడా పాల్గొని ఆమెను ఆశీర్వదించారు శ్రీ పి బి శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు

జిల్లా జడ్జి శ్రీ గోపాలాచార్యులు, డా బేతవోలు రామబ్రహ్మం ఆమెకు సన్మాన పత్రాలను సమర్పించారు.

అనంతరం జరిగిన ''సంగీత విభావరి''లో ప్రముఖ గాయనీగాయకు లందరూ దక్షిణ భారత చలన చిత్రాలలో జనాదరణ పొందిన పాత, కొత్త పాటలు పాడి శ్రోతలని ఆనందాబ్ధిలో ముంచెత్తారు

— చలసాని నరేంద్ర

అయిదు రాత్రుల వివాహం చెయ్యలేనని మా మామగారు అంటుంటే, 'చెయ్యాల్సిందే' అని మా నాన్నగారు పట్టుబట్టినప్పుడు కాదని ఎదిరించి ఏక రాత్రి వివాహం జరిపించిన వాడిని అప్పట్లోనే కట్నం తగ్గించాలని పట్టుబట్టిన వాడిని, అలక పాన్పు వద్దన్నవాడిని, భార్యని బాగా చూసుకున్న వాడిని మా చుట్టుపక్కల నేనొక్కడినే కావాలంటే మీ అమ్మ ఫొటో చూడు. ఆ కళ్ళల్లో ఆ తృప్తి చూడు!

అలాంటి వాడిని ఈ రోజున నా పిల్లలముందు దోషిగా, అభ్యుదయ భావాలు లేని పాతకాలపు మనిషిగా వేలెత్తి చూపించబడే స్థితిలో నిలబడి ఉన్నాను కారణం ఏమిటి? ఇప్పుడు ఆ సమస్యలు లేవు నా ఆదర్శాలకి విలువలేదు ఇప్పుడు అవి ఆదర్శాలంటే అందరూ నవ్వుతారు అవి కనీస ధర్మాలు

నా ముందు తరం ఆదర్శాలని విని నేనూ అలాగే నవ్వేవాడిని.

మనిషి ఆలోచనల పరిధి, సంస్కరణ తత్వం అప్పటి సామాజిక పరిస్థితులను మించి పదిమెట్ల కన్నా ముందుకువెళ్లదు వెడితే పిచ్చివాడని పిలవ బడతాడు మా ఆలోచనలు వెళ్లగలిగినంత దూరం వెళ్లి ఆగిన చోట మీ ఆలోచనలు ప్రారంభం అవుతాయి ముందుతరంతో సమన్వయం సాధించలేక మనిషి 'ఇది నా తరం కాదు' అనుకుంటాడు — తన అసమర్థతని తెలుసుకుంటూ, తరం మార్పుని గుర్తిస్తూ.

అలాగే నీ తరానికి నీదే ఆదర్శం అనుకున్నా నీ తర్వాత తరానికి అది గొప్పగా అనిపించక పోవచ్చు. నువ్వు శీలం పోగొట్టుకున్న స్త్రీని పెళ్లాడితే, నీ తర్వాత తరం వాళ్ళు ఆమెకి వేరే వ్యక్తివల్ల పుట్టిన బిడ్డని తన బిడ్డగా స్వీకరించి ఆమె మాతృత్వానికి విలువ నిచ్చే ఔదార్యాన్ని ప్రదర్శించవచ్చు ఆ పరిస్థితి నీకు రాలేదు. సుజాత బిడ్డ మరణించాడు. ఒక వేళ బ్రతికి ఉంటే అంత హృదయ వైశాల్యం ప్రదర్శించ గలిగేవాడివా? ఆలోచించు. కాని నీకిప్పుడు పుట్టిన చిన్నారి రఘు తన అన్నని సంతోషంగా అంగీకరించే వాడేమో! ఉయ్యాలలో ఉన్న రఘుని అడిగి చూడు!

ఇదంతా నిన్ను బాధ పెట్టడం కోసం వ్రాయటం లేదు. తరాల సంఘర్షణలో నేను ఎలా దెబ్బ తిన్నానో నీకు తెలియజెయ్యడానికి వ్రాస్తున్నాను నేను చాలా సెన్సిటివ్ అని నీకు తెలుసు

ఇవి నా భావాలు. నా తీవ్రమైన ఆలోచనల ప్రతిరూపాలు. నా ఆలోచనల మధ్యలోని బరువంతా కాగితం మీదికి దించేసి నిర్వికారంగా, నిర్గుణంగా ఉన్నాను నిన్ను బాధ పెట్టడం నా ఉద్దేశం కాదని మరోసారి చెబుతున్నాను. పాత తరం సంస్కర్త వయిన నా ఆలోచనలలో కొత్త తరం సంస్కర్త వయిన నీవూ తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయేమోనని అనిపించి నీకీ ఆలోచనా ప్రవాహాన్ని అందిస్తున్నాను.

అయితే రెండు తరాల మధ్య రగడ వచ్చినప్పుడు ఎవరు రాజీకి రావాలి? అనికూడా ఆలోచన వచ్చింది. ఒక తరం మాత్రమే చూసి ఆవేశం, ఉత్సాహం తప్ప చేదు అనుభవాలు లేని నువ్వా? రెండు తరాలు చూసి అనుభవం గడించి తరాల అనంతరం యొక్క చేదుని రుచి చూసిన నేనా?

నాకు అనిపించింది ఏమిటంటే— తెలిసినవాడు, 'ఇంకా తెలియ వలసినవాడి' మీద ప్రేమ, జాలి, అభిమానం, క్షమ చూపాలి అనిపించింది.

ఇప్పుడు నా మనస్సు నిర్మలంగా ఉంది

హృదయ పూర్వకంగా నీతో, జయతో, శేషుతో కోడలితో చెలిమి కోరుతున్నాను మీ అమ్మ బ్రతికి ఉంటే ఇలా మనం దూరం అయే వాళ్ళమా? తను కానిచ్చేదా?

రెండు చేతులూ చాచి ఆహ్వానిస్తున్నాను

మనం మళ్లీ ఒక కుటుంబంగా కలవాలని నాకు అనిపిస్తున్నట్లుగా ఈ ఉత్తరం చదివాక నీకూ అనిపిస్తే నువ్వూ, కోడలూ, బాబూ నా దగ్గరకి రండి ఎంతయినా పెద్ద వాడిని కదా.

చి సౌ. సుజాతకి నా ఆశీస్సులు

చి. రఘుకి నా ముద్దులు

ఇట్లు
ప్రేమతో
రాఘవరావు

పి. యస్:— కోడలికి ఈ ఉత్తరాన్ని చూపించమని మొదట్లో రాశాను చూపించాలని అనిపిస్తేనే చూపించు. లేకపోతే నీ మనసుకి తోచినట్లు నిజం కాని, అబద్ధం కాని చెప్పు. —రాఘవరావు.

* * *

ఉత్తరం చదివిన రమేష్, సుజాతల కళ్లలో నీళ్లు తిరిగాయి. ఒక్క క్షణం ఆగి 'సుజాతా! ప్రయాణానికి సిద్ధం చెయ్యి' అన్నాడు రమేష్. సుజాత ఈ నిర్ణయానికి సంతోషించింది''

రమేష్ రఘుకేసి తిరిగి 'తాతగారి దగ్గరకి వెడుతున్నామురా' అన్నాడు. చిన్నారి రఘుకి ఏమి అర్థం అయిందో బోసినవ్వు నవ్వాడు. అది అందంగా వెన్నెలలాగా ఉంది.

అచ్చం తాతగారు నవ్వినట్లే ఉంది. ★